దైవప్రార్థన

కరుణామూర్తియగు దేవా!

మా చిత్తము సర్వకాల సర్వావస్థలయందును మీ పాదారవిందములందు లగ్నమై అచంచలమైన భక్తితో కూడి యుండునట్లు అనుగ్రమింపుడు.

పరమ దయానిధీ!

ప్రాతఃకాలమున నిద్రలేనిచినది మొదలు మరల పరుండు వఱకును మనోవాక్కాయములచే మా వలన ఎవరికిని అపకారము కలుగకుండునట్లును, ఇతర ప్రాణికోట్లకు ఉపకారము చేయులాగునను సద్బుద్ధిని దయచేయుడు.

సచ్చిదానందమూర్తీ !

మా యంతఃకరణమునందు ఎన్నడును, ఏ విధమైన దుష్టసంకల్పముగాని, విషయవాసనగాని, అజ్ఞానవృత్తిగాని, జొరబడకుండునట్లు దయతో అనుగ్రహింపుడ.

వేదాంత వేద్యా! అభయస్వరూపా!

మా యందు భక్తి జ్ఞాన వైరాగ్యబీజము లంకురించి శీఘ్రముగా ప్రవృద్ధము లగునట్లు ఆశీర్వదింపుడు. మఱియు ఈ జన్మమునందే కడతేరి మీ సాన్నిధ్యమున కేతెంచుటకు వలసిన శక్తి సామర్థ్యములను కరుణతో నొసంగుడు.

దేవా!

మీరు భక్తవత్సలురు. దీనులపాలిట కల్పవృక్ష స్వరూపులు. మీరు తప్ప మాకింకెవ్వరు దిక్కు? మిమ్ములను ఆశ్రయించితిమి. అసత్తు నుండి సత్తునకు గొనిపొండు. తపస్సు నుండి జ్యోతిలోకి తీసుకొనిపొండు. మృత్యువు నుండి అమృతత్వమును పొందింపజేయుడు. ఇదే మా వినతి. అనుగ్రహింపుడు. మీదరిజేర్చుకొనుడు. పాహిమాం! పాహిమాం! పాహిమాం! పాహి.

తత్త్వసారము

రచయిత

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

ప్రకాశకులు

శ్రీ శుకబ్రహ్మాశ్రమము

శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు), స్వామి విద్యాప్రకాశానందనగర్,

శ్రీకాళహస్తి (చిత్తూ జిల్లా), ఏ.పి.

పిన్ : 517 640

ప్రస్తావన

వేద శాస్త్రములందు ఎన్నియో పరమరహస్యములు నిగూఢములై యున్నవి. విద్వాంసులు వాటిని చక్కగా తెలిసికొనగల్గుచున్నారు. కాని జనసామాన్యము నకు గూడ అవి అందుబాటులో నుడవలెనన్న వారికి గూడ అవి చక్కగ అర్థము కావలెనన్న సులభమైన భాషలో జటిలము కాని భావముతో అవి ప్రచారమునకు రావలసి యున్నవి. ఇట్టి అభిప్రాయముతోనే శ్రీ స్వాములవారు ఉపనిషత్తులు, భగవద్గీత మున్నగు ప్రామాణిక గ్రంథములందుగల ధర్మ రహస్యములను సర్వజనులకును తేట తెల్లముగ తెలియులాగున "మానసబోధ" అను ఈ చిన్న పుస్తకమును రచించిరి. ఇందు 108 తత్త్వములు కలవు. ముముక్షువులు వీనిని చక్కగా మననము చేసికొని ఆనందానుభూతిని బడయగలరని విశ్వసించుచున్నాము.

ఇట్లు
ప్రకాశకులు

మానసబోధ

తత్త్వసారము

1. తత్త్వసారము తెలిసికోరన్నా
సద్గురునిచెంత, నిజము గనుగొని లాభమొందన్నా
పాపరత్యము పారద్రోలి
ద్వేషభావము రూపుమాపి
అంతటను పరమాత్మ కలడని
నెమ్మనంబున బోధ సల్పుము. ॥త॥

2. పాపము కాదు త్రాడురోరన్నా
దీప కాంతిలో, సత్యవిషయము తెలిసికోరన్నా
త్రాడు, త్రాడై యుండి యుండగ
త్రాడు పామని భ్రమసి ఏడ్చుచు
తామసంబున కాల మంతయు
పాడుచేయక తెలివినొందుము ॥త॥

3. ఆలుబడ్డిలు వెంటరారన్నా
నిజమెఱిగి నీవు, బంధుజాలపు మమతవీడన్నా
పక్షిజాలము చెట్టుపైన
చేరియుండును సంధ్యవేళ
పొద్దుపొడువగ పక్షు లన్నియు
వీడిపోవును వేఱు వేఱుగ. ॥త॥

4. తనువు నిత్యము కాదురోరన్నా
ధరణిపై నది ఎల్లకాలము ఉండబోదన్నా
దండధరుడు పొంచియుండగ
పాపకార్యము ఏలచేయుదు
పాశహస్తుడు రాకపూర్వమే
ధర్మమార్గము దరికి జేర్చుము. ॥త॥

5. గీత సతతము ఆశ్రయించన్నా
ఉపనిషత్తుల సారమే యది తెలిసికోరన్నా
గీతమాతకు సేవ సలిపి
గీతతత్త్వము మదిని దాల్చి
గీత చెప్పిన కృష్ణదేవుని
పాదపద్మము నమ్మి కొలువుము ॥త॥

6. తనువు చూసి మురిసిపోకన్నా
మట్టి బొమ్మది, అందమేమియు లేదులేదన్నా
అందమైన ఆత్మవదలి
నింద్యమైన మేను నేనని
తలుపువీడి శాశ్వతంబగు
సచ్చిదాత్మను స్మరణ చేయుము ॥త॥

7. మట్టివంటి దేహమోరన్నా
జడమైనదే యది, చిత్స్వరూపము కాదుకాదన్నా
కుండవంటి మేనుగాంచి
చేతనంబని తలచువాడు
సత్యమేమియు తెలియ లేకనె
గోతిలో పడిపోవు తథ్యము ॥త॥

8. మనసుపైన జయము పొందన్నా
ఇంద్రియంబుల, టక్కుచూసి మోసపోకన్నా
దేహమందలి చతురచోరుల
చర్య లన్నియు గాంచుచుండుము
బుద్ధికుశలత గలిగి నేర్పుతో
వారినెల్లను తరిమివైచుము. ॥త॥

9. పాముపామని కేకవేయకురా
పాముకాదది, చేదబావిత్రాడు మాత్రమేరా
చేతబావి త్రాడు చూచి
భీతి నొందదవేల నరుడా
దీపకాంతిలో సత్య మెఱిగి
భయము వీడి శాంతి నొందుము. ॥త॥

10. మట్టిబొమ్మవు నీవు కాదన్నా
పరమార్థ సత్యము, జాగుచేయక తెలిసికోరన్నా
మట్టిలో మాణిక్య మున్నది
వెతకువానికి కానవచ్చును
సత్యమైన ఆత్మరూపము
తెలియువానికి ముక్తిపదము. ॥త॥

11. కామదాసుడు కాకుమోరన్నా
కామంబు శత్రువని, గీతశాస్త్రము పలుకుచున్నదిరా
కామదాసై చెడుటకంటె
రామదాసై యుంట మేలు
రామభక్తిని గలిగి రయమున
ముక్తిధామము చేరు నరుడా ॥త॥

12. విశ్వమంతయు నీదు దేహమురా
సర్వత్ర నీవు, వ్యాప్తినొంది వెలయుచుంటివిరా
జగమునంతట నీవేయుండ
ఎవడు శత్రువు ఎవడు మిత్రుడు
భేదభావము వీడి మదిని
సామరస్యము గలిగియుండుము ॥త॥

13. దామనామమె నీవకు శరణమురా
ఎల్లవేళల, తారకంబున జపము చేయుమురా
మక్కువతో శ్రీరామనామము
మిక్కుటముగ స్మరణచేయుము
రామనామపు శక్తిచేత
పారిపోదురు యముని దూతలు ॥త॥

14. ప్రణవమంత్రము జపము చేయన్నా
ఓంకారనాదము, ఎల్లదిక్కుల మ్రోగించుదన్నా
ఇంద్రియాలను కుదుటపఱచి
సూక్ష్మదృష్టితో ఆలకించిన
ప్రణవరూపము గోచరించును
హృదయకుహరములోన లెస్సగ. ॥త॥

15. దైవనామము ఉచ్చరించన్నా
తారకం బది, సాగరంబును దాటవేయన్నా
సులభమైన నావ పొందియు
ఉదధి దాటక ఊరకుండిన
మానవత్వము మంటగలియును
అంతమొదదు జన్మదుఃఖము ॥త॥

16. రక్తమాంసపు తోలుబొమ్మన్నా
కాయమందున, సారమైనది ఒకటి లేదన్నా
బంకమట్టి ఇల్లువంటి
దేహమే తా ననుచు మదిని
తలచుచుండుట వెఱ్ఱికాదా
బ్రహ్మమే తానగుచునుండ ॥త॥

17. జన్మజన్మకు కర్మ అంటునురా
నరజన్మమందున కర్మనంతను కడిగి వైచుమురా
కర్మశేషము ఉండియుండిన
దుఃఖ శేషము వెంబడించును
కర్మలేని దివ్యపదవిని
పొందగోరుము సత్వరంబున ॥త॥

18. తత్త్వమర్మము తెలిసికోరన్నా
బ్రహ్మ సత్యము, జరగలేదని పలుకుమోరన్నా
తత్త్వసారము తెలియలేకనె
తప్పదారిన అనుసరించకు
గురువు శాస్త్రము బోధచేసిన
మార్గమందే పోవ నేర్వుము. ॥త॥

19. పాపకార్యము చేయబోకన్నా
పాపఫలితము పరమదుఃఖము తెలిసికోరన్నా
రాక్షసత్వము పారద్రోలి
దైవ భావన కుదుటపఱచి
పాపగంధము లేశమైనను
లేకయుండుము చిత్తమందున. ॥త॥

20. జీవభావము మఱచిపోరన్నా
సద్గురుని జేరి, ఆత్మభావము కలిగియుండన్నా
నేను జీవుడ నేను దేహమే
యనుచు సతతము ఏల తలతువు
నిత్యమైన సత్యమైన
ఆత్మయే నే ననుచు మెలగుము ॥త॥

21. రామరాజ్యము వెలయజేయన్నా
సర్వజీవులు, నీ స్వరూపులే వేఱుకాదన్నా
ప్రేమభావము శాంతభావము
మనసునందున పొంగి పొరలగ
ఎల్ల ప్రాణుల నాదరించియు
దైవకరుణకు పాత్రుడగుము ॥త॥

22. దైవభావము గలిగియుండన్నా
చిత్తమందున, అసురభావము పారద్రోలన్నా
శమదమాదుల నాశ్రయించి
గర్వమదముల, దొలగద్రోసి
అలలులేని సాగరంబున
అంతరంగము వెలయజేయుము. ॥త॥

23. బ్రహ్మతత్త్వము తెలిసికోరన్నా
సద్గురునిజేరి, స్వస్వరూపము గనుమురోరన్నా
ఆత్మయందున నిష్ఠ గలిగి
దృశ్యమందున రోత గలిగి
ఆత్మ దేవుని పొందు నిక్కము
జీవితాంతము కాకపూర్వమె. ॥త॥

24. శాస్త్రసారము గనుమురో రన్నా
నిక్కముగ నీవు, దుఃఖరూపము కాదుకాదన్నా
పరమసుఖమే నీ వటంచును
మదిని నమ్ముము ఎల్లవేళల
స్వస్వరూపము బ్రహ్మ మనుచును
ముదముతో ఎలుగెత్తి పాడుము. ॥త॥

25. మాయవలలో చిక్కుపడకన్నా
బహుజాగరూకతతో, దానిజాడలు తెలిసికోరన్నా
తీవ్రసాధనం చేసి దాని
అంతుతేల్చుము సత్వరంబున
మాయమర్మము తెలియువానికి
మాయ సుంతయు బాధచేయదు. ॥త॥

26. విషయసుఖమును కోరబోకన్నా
ఆత్మశాంతికి, భంగకరమే యగును ఓరన్నా
దుఃఖమిశ్రితమైన సుఖము
సుఖము కాదని మదినెఱుంగుము
దుఃఖలేశము లేని సుఖము
ఆత్మయందే కలదు నరుడా! ॥త॥

27. పుణ్యకార్యము వదలబోకన్నా
పుణ్యంబు చేతను, పాపమంతయు భస్మమగునన్నా
చిత్తశుద్ధికి హేతువైన
పుణ్యపుంజముచేత లెస్సగ
స్వస్వరూపజ్ఞాన మొదవును
బంధముక్తియు కలిగితీరును ॥త॥

28. బ్రతుకు పరిమితి అల్పమోరన్నా
చిగురాకు అంచున, మంచుబొట్టును పోలియుండన్నా
రేపో మాపో ఊడిపోయే
క్షణిక దేహము నమ్ముకొనక
చావుపుట్టుక లేని ఆత్మను
పొంది శాంతిని అనుభవింపుము ॥త॥

29. దృశ్యవస్తువు నమ్ముకొనకన్నా
కనుపించువస్తువు, కాలమందున లీనమగునన్నా
దృశ్యమందును మనసునుంచక
దృక్స్వరూపమే శాశ్వతంబని
ఎంచి మదిలో ఆత్మధ్యానము
చేయువానికి పరమసుఖము ॥త॥

30. బింబసుఖమును కోరుకొనుమన్నా
ప్రతిబింబసుఖము, ఎంతయైనను విలువలేదన్నా
అద్దమందలి చంద్రబింబము
ఎంతో చక్కగా గోచరించిన
దానికై పరుగెత్తువాడు
బాలుడేయని మది నెఱుంగుము ॥త॥

31. భోగములకై ఆశపడకన్నా
భోగంబుచేతను యోగమంతయు దూరమగునన్నా
యోగవిద్యను ఆశ్రయించి
భోగజాలము వదలివైచి
ఆత్మయందున నిష్ఠగలిగి
జీవితంబును గడిపివేయుము. ॥త॥

32. సజ్జనంబుతో మైత్రినెఱపన్నా
దుర్జనంబును, దూరదూరము విడిచిపెట్టన్నా
సజ్జనంబుల సాహచర్యము
మోక్షమార్గపు మొదటిమెట్టని
వేదశాస్త్రములన్ని ఒకటిగ
ఘోషచేయుచు నున్న విలలో. ॥త॥

33. భారమేమియు లేకయుండన్నా
దృశ్యవస్తువు భారమేయని తెలిసికోరన్నా
బయటి భారము, లోని భారము
భారమంతయు తొలగద్రోసియు
భావరహితంబైన ఆత్మలో
కాపురంబును గలిగియుండుము. ॥త॥

34. నరుని దేహము అరుదురోరన్నా
మానవత్వము, ఎల్లవేళల రాదు రాదన్నా
ఉత్తమంబగు దేహమొంది
విషయసౌఖ్యము దూరముంచి
సర్వసుఖముల నిలయమైన
ఆత్మబడసి ముక్తినొందుము. ॥త॥

35. చిత్తశుద్ధిని గలిగియుండన్నా
మానసంబున, మురికియేమియు లేకయుండన్నా
నిర్మలంబగు నీటియడుగున
తేట తెల్లము కానుపించును
శుద్ధమైన చిత్తమందున
ఆత్మవస్తువు గోచరించును. ॥త॥

36. దేవదేవుడు చెంతగలడన్నా
దూరదూరము, పోయిపోయి వెతకుటేలన్నా
పంచకోశములోన వెతకిన
ఆత్మజ్యోతియు కానుపించును
ఆత్మజ్యోతియె పరమదేవుడు
సాదరంబుగ మదిని నమ్ముము. ॥త॥

37. జగము నాటకశాలయే రన్నా
జగన్నాటక సూత్రధారిని కనుమురోరన్నా
పాత్రధారివి కాక యిచట
సూత్రధారీపదము నొంది
వేషమంతయు వదలివైచి
మరల నెన్నడు స్వీకరింపకు. ॥త॥

38. మాయమర్మము తెలిసికోరన్నా
అద్దాని మోసము ఎఱిగి జాగ్రతనొందుమోరన్నా
మాయయొక్క తళుకుబెళుకులు
చూచి సుంతయు రాగమొందుకు
మూడురోజుల ముచ్చటే యని
దాని తత్త్వము తెలిసికొనుము. ॥త॥

39. మోక్షధామము త్వరగ చేరన్నా
నరజన్మ మిచట మాటిమాటికి రాదురోరన్నా
దుర్లభంబగు మానవత్వము
పొందియుండియు దైవకృపకై
యత్న మేమియు చేయకున్నచో
నరకకూపము పాలుపడుదురు

40. అణువు అనువునా దైవముందన్నా
బ్రహ్మాండమంతయు ఆత్మరూపమే తెలిసికోరన్నా
ఏకతత్త్వము నాశ్రయించి
ద్వేషబుద్ధిని పారద్రోలి
ప్రేమభావము వెల్లిఉబుక
జీవితంబున శాంతినొందుము. ॥త॥

41. పుట్టిచచ్చుట రోగమగునన్నా
భవరోగవైద్యము, భూతలంబునె కలదురోరన్నా
వైద్యసదుపాయంబు లేని
ఇతర లోకము కేగి యచట
రోగశాంతియు కుదురనేరక
బాధనొందెదవేల నరుడా!

42. విద్యలెన్నియొ కలవురోరన్నా
అన్నింటిలోనూ, చావుతప్పే విద్యగొప్పన్నా
ఎన్ని చదువులు చదువనేర్చిన
పుట్టి చచ్చిన నేమి ఫలము
జన్మమేమియు లేని పదవిని
కలుగజేసెడి విద్య శ్రేష్ఠము.

43. గర్వభావము కదలివేయన్నా
సృష్టిలోపల భూమియెంతో స్వల్పమగునన్నా
విశ్వరూపమునందు గాంచిన
భూమియంతయు ఆవగింజె
అల్పమైన భూమిలోపల
ఇల్లువాకిలి చూచి మురియకు. ॥త॥

44. దైవచింతన గలిగియుండన్నా
నిద్రలేవగ, దైవనామము స్మరణచేయన్నా
వ్యర్థవాక్యము లన్ని వదలి
దైవనామామృతము గ్రోలుచు
జీవితంబును సార్థకంబుగ
చేసికొనుము సత్వరంబుగ. ॥త॥

45. ఎట్టి ప్రాణికి కీడువలదన్నా
కీడుచేసిన, నిన్ను నీవే కొట్టినట్లన్నా
విశ్వరూపమునందు తాను
పరుడు ఒకటే యగుచునుండగ
హింసభావము అర్థరహితము
తెలివినొందిన వైరముడుగును. ॥త॥

46. దేహమందున సొగసులేదన్నా
సొగసు అంతయు ఆత్మలోనే కలదురోరన్నా
రేపో మాపో క్రుళ్ళిపోయే
దేహమందున సొగసు ఎచట
పుట్టకుండను చావకుండును
ఉండు ఆత్మకె సొగసు ధరలో. ॥త॥

47. క్షణికమైనది జీవితంబన్నా
పరమార్థ తత్త్వము, జాగచేయక తెలిసికోరన్నా
కాలయాపన యేమి చేయక
దేనికొఱకు భీతినొందక
గురుని చెంతన చేరిరయమున
తారకంబును తెలిసికొనుము. ॥త॥

48. దివ్య మంత్రము జపము చేయన్నా
పరమాత్మ కృపచే సాధనంబులు సుళువు అగునన్నా
దివ్యమంత్రపు మహిమచేత
పాపమంతయు భస్మమగును
పాపరాశి తొలగకుండిన
జ్ఞానమేమియు కలుగకుండును. ॥త॥

మానసబోధ

49. కాలమెంతో విలువ గలదన్నా
క్షణమైన దానిని ఖర్చు చేయకు భోగమందన్నా
గడచిపోయిన కాలమేమియు
సుంతయైనను తిరిగిరాదు
ఉన్నకాలము జాగరూకతతో
గడిపివేయుము దైవచింతతో. ॥త॥

50. గీతవిద్యను చదువుకోరన్నా
అద్దానియందున, ఉపనిషత్తుల సారముందన్నా
గీతవాక్యము స్మరణచేయుచు
గీతబోధన ఆచరించుచు
కృష్ణవాణిని మదిని దలచుచు
బ్రహ్మధామము చేరు రయమున. ॥త॥

51. సాధనంబును చేయవలెనన్నా
అనుభూతియంతయు, సాధనంబుచె గట్టిపడునన్నా
నియమపూర్వక నిష్ఠచేతను
మురికినంతను తొలగిద్రోచియు
నిర్మలంబగు మానసంబున
దేవదేవుని గాంచుచుండుము. ॥త॥

52. దుర్గుణాలను అణచివేయన్నా
అభ్యాసవశమున, ఇంద్రియాలను గెలుచుకోరన్నా
రోజరోజా నియమనిష్ఠతో
జపతపాదులు సలుపుచుండుము
పుణ్యకార్యము లాచరించిన
చిత్తమెంతయొ శుద్ధపడును.

53. ఆత్మయొక్కటే శాశ్వతంబన్నా
దృశ్యమంతయు, రేపో మాపో విలయమొందన్నా
నశ్వరంబగు దేహజాలము
శాశ్వతంబని మదిని నమ్మక
శాశ్వతంబగు ఆత్మదేవుని
గాంచి ముక్తిని బొందు శీఘ్రము. ॥త॥

54. ఎన్ని జన్మలు గడచెనోరన్నా
బహుకాలమందు, జీవితంబులు అంతమగునన్నా
అన్ని హంగులతోను గూడిన
ఉత్తమంబగు జన్మనొందియు
తన్ను తాను తెలిసికొనక
కన్నుమూసిన జన్మ వ్యర్థము.

55. శాస్త్రవాక్యము వినుమురోరన్నా
వినిన వాక్యము, ఎల్లవేళల స్మరణచేయన్నా
విన్న దానిని స్మరణచేయుచు
భావమంతయు గట్టిపరచుచు
ధ్యాననిష్ఠచే హృదయమందున
ఆత్మదేవుని గాంచు రయమున. ॥త॥

56. కష్టసుఖముల నోర్చుకోరన్నా
ద్వంద్వంబులన్నియు ధీరబుద్ధితో గెలుచుకోరన్నా
పొగడినప్పడు పొంగిపోకను
తిట్టినప్పడు క్రుంగిపోకను
ఎట్టిస్థితిలోనైన నీవు
దృష్టి సమముగ నిల్పియుండుము. ॥త॥

57. అన్న శుద్ధియు అవసరంబన్నా
జీవితంబున అన్నదోషము లేకయుండన్నా
మితముగాను హితముగాను
సాత్త్వికంబుగ వెలయునట్టి
భోజనంబుచె చిత్త మెంతయొ
శుద్ధపడునని నమ్ము శీఘ్రము. ॥త॥

58. తోలుతిత్తిది తెలుసుకోరన్నా
దేహయంత్రము, అందమైనది కాదు కాదన్నా
వెదురుబొంగును బోలినట్టి
జడస్వరూపమునందు నీవు
నేను నేనను మమత వీడి
సుఖము నొందుము శాశ్వతంబుగ ॥త॥

59. దొంగ లార్వురు తెలిసియుండన్నా
జ్ఞానమంతను దొంగిలించేవారురోరన్నా
జాగరూకత కలిగియుండి
వైరులను కనిపెట్టియుండుము
కామజాలమునంత నీవు
జ్ఞానబలముచె తుడిచివేయుము. ॥త॥

60. మెల్ల మెల్లగ సాగిపోరన్నా
సాధనంబున, మధ్యమార్గమై ఉత్తమంబన్నా
ధీరమైనబుద్ధి గలిగి
మెట్టుమెట్టు దాటిపోవుచు
శాంతభావము వీడకుండను
బ్రహ్మపదమును చేరిపొమ్ము. ॥త॥

61. దైవపాదము నాశ్రయించన్నా
భవరోగమంతయు సత్వరంబున నాశమగునన్నా
ఎల్ల వేళల దైవస్మరణను
వీడకుండగ చేయుచుండుము
దైవగురువుల కరుణచేతను
దురిత మంతయు తొలగిపోవును. ॥త॥

62. సౌమ్యభావము కలిగియుండన్నా
దేవులందును, భేదమేమియు చూడబోకన్నా
దేవు లందఱు ఒక్క రూపమే
భేదబుద్ధిని తొలగద్రోయుము
బ్రహ్మ మొక్కటె దేవులందఱి
రూపమేయని మది నెఱుంగుము. ॥త॥

63. వస్తువొక్కటె కలదురోరన్నా
దృష్టిభేదమె కలహములకు కారణంబన్నా
ఏకరూపము వెలయుచుండ
భిన్న మేలకో జీవులందు
బిబమొకటని తెలిసికొనిన
కలహమేమియు నుండబోదు. ॥త॥

64. మానసంబున భయమువీడన్నా
జగమునందున ఆత్మకన్యము ఏదిలేదన్నా
ఆత్మయంతటి వెలుగుచుండ
తాను ఎవరు ఇతరు డెవరు?
నీ స్వరూపము చూచి నీవు
భీతినొందెదవేల నరుడా? ॥త॥

మానసబోధ

65. చెట్టుమోడది దొంగకాదన్నా
చీకటిలో నయ్యది దొంగయేయను భ్రాంతి వీడన్నా
దీపకాంతిలో చూచినపుడు
సత్యమేదియొ గోచరించును
జ్ఞాన మొందిన కాలమందున
జగము బ్రహ్మమని తేలిపోవును. ॥త॥

66. గొలుసుకొఱకై ఏడ్వబోకన్నా
అద్దానికొఱకై, ఇల్లు ఇల్లు వెతకబోకన్నా
గొలుసు నీదు కంఠమందె
వెలయుచున్నది తేట తెల్లము
ఆత్మదేవుడు చిత్తమందె
దాగియుండ దుఃఖమేలకొ. ॥త॥

67. జీవితం బతి చంచలంబన్నా
విశ్వమందున, చంచలత్వము లేనిదేదన్నా
నేడు ఉన్నది రేపు ఉండదు
రేపు ఉన్నది నాశమొందును
నాశమే లేకున్న వస్తువు
ఆత్మయేయని నిశ్చయించుము. ॥త॥

68. నిన్ను నీవు తెలిసికోరన్నా
నిన్ను తెలియక, ఏది తెలిసిన వ్యర్థమేనన్నా
ఆత్మయందున విశ్వమంతయు
ఇమిడియున్నది స్పష్టరీతిని
ఆత్మనెఱిగిన సర్వజగము
ఎఱుగబడినది యగుచునున్నది. ॥త॥

69. పంచకోశములోన యుందన్నా
ఆత్మదీపము తెరలవెనుక దాగియుందన్నా
గురువుచెంత బోధనొంది
సాధనంబును లెస్ససలిపి
కోశవర్గములోన దాగిన
ఆత్మభానుని గాంచు వేగవమె. ॥త॥

70. జ్ఞానయోగము నాశ్రయించన్నా
జ్ఞానసిద్ధికి, భక్తికర్మలు సాయపడునన్నా
కర్మయోగము భక్తియోగము
ధ్యానయోగము నాచరించిన
మనసు నిర్మలమగును నిక్కము
జ్ఞానసిద్ధియు కలగితీరును. ॥త॥

71. మాయయొక్క మర్మమెఱుగన్నా
ఉన్నదానిని, లేనిదానిగ చూపునోరన్నా
లేని జగమును ఉన్నదానిగ
ఉన్న దేవుని లేనివానిగా
చూపుచుండును మాయ తథ్యము
జాగరూకత కలిగియుండుము. ॥త॥

72. ధ్యానిష్ఠను అభ్యసించన్నా
ధ్యానమందును, చిత్త మిటునటు కదలరాదన్నా
దృశ్యవస్తువుపై విరాగము
కలిగి మనసును శాంతిపఱచి
ఆత్మయందును కుదుటపఱచి
అన్యమేమియు తలచకుండుము. ॥త॥

73. ఎన్ని తిన్నను తృప్తి లేదన్నా
భోగజాలపు, అనుభవానికి అంతులేదన్నా
విషయభోగము నెంత బడిసిన
చాలు అనదు పాడు మనసు
తృప్తిలేని జీవితంబున
శాంతి యెన్నడు కలుగకుండును.

74. మనిషి కాయువు అల్పమోరన్నా
నూరుఏడుల, వయసు కలదని మురిసిపోకన్నా
బాల్యమంతయు ఆటలందు
యౌవనంబు కామమందు
ముసలితనము రోగమందు
గడిచిపోవు చున్న దిలలో. ॥త॥

75. కాలమెంతయు విలువగలదన్నా
బహుజాగరూకతతో, దానినంతను గడుపురోరన్నా
రోజు రోజా పెందలాడే
లేచి ప్రార్థన సలుపుచుండుము
దైవచింతన చేయకుండను
చద్దియైనను తినక యుండుము. ॥త॥

76. సంపదలకై ఆశపడకన్నా
కొద్ది ధనముతో, పరమతృప్తిని బడయుమోరన్నా
న్యాయమైన మార్గమండలి
స్వల్పమైన ధనము శ్రేష్ఠము
వక్రమార్గపు అధికధనము
పాప హేతువు భువిలో నిక్కము. ॥త॥

77. ప్రాణికోట్లకు మేలుచేయన్నా
జీవితంబున హిత మొనర్చుటె ముఖ్యమోరన్నా
నదులు చెరువులు పండ్ల తరువులు
జనుల కెంతయొ మేలు చేయును
ఫలితవృక్షము భంగి నీవు
పరుల శ్రేయము గోరుచుండుము. ॥త॥

78. గురునిచెంత విద్యనేర్వన్నా
ఆత్మతత్వము, నోటిమాటలు కాదుకాదన్నా
ఆదరంబుగ సేవచేసి
గురుకటాక్షము బడయు నీవు
గురువు చెంతను వాసము నుండి
కీలకంబుల దెలిసికొనుము.

79. భోగమందున రోగమందన్నా
భోగంబుచేతను రోగబాధలు పెరుగుచుండన్నా
విషయమందున దోషముందని
తెలివితో గ్రహించి నీవు
మెల్లమెల్లగ వాని నెల్లను
జ్ఞానబలముచె విడిచివేయుము. ॥త॥

80. పాపమంతయు పారద్రోలన్నా
పుణ్యంబుచేతను, చిత్తశుద్ధిని బడయుమోరన్నా
జపముచేతను, తపముచేతను
తీర్థయాత్రల సేవచేతను
పుణ్యపుంజము పెంచి పెంచి
మోక్షపదవిని బొందు శీఘ్రము. ॥త॥

81. ప్రాణికోట్లకు మేలుచేయన్నా
పరసుఖంబును నీవ సుఖంబుగ నెంచుకోరన్నా
పరుల దుఃఖము పారద్రోలి
పరుల సుఖము లెస్సగోరి
ప్రాణులన్నిటిలోని దైవము
నాదరంబుగ సేవచేయుము. ॥త॥

82. ఉపనిషత్తుల సారమెరుగన్నా
వేదంబులన్నిటి శిరములే యని విశ్వసించన్నా
ఉపనిషత్తులు బోధసలుపు
బ్రహ్మ సత్యము జగము మిథ్య
నీవె బ్రహ్మము అనెడి సూత్రము
ఆచరించియు ముక్తి బడయుము. ॥త॥

83. విశ్వమంతయు రత్నమాలన్నా
దేవదేవుడు, దారమేయని మదిని నమ్మన్నా
అన్ని రత్నములందు దారము
వ్యాప్తినొంది వెలయు విధమున
ఆత్మదేవుడు సర్వజగమున
నిండియుండి వెలయుచుండును. ॥త॥

84. తాను దేహము కాదు కాదన్నా
తన స్వరూపము, నాశమొందని ఆత్మయేయన్నా
మట్టికుండను బోలి దేహము
పుట్టిచచ్చును ఎల్లవేళల
ఆత్మయెప్పడు చావు లేకనె
అంతట వెలుగొందుచుండును. ॥త॥

85. దేవదేవుని పూజచేయన్నా
దేవపూజను భక్తితోటి సలుపవలెనన్నా
చిత్తమందున భక్తిలేక
ఎంతచేసిన నేమి ఫలిము
భక్తితో ఇసుమంత చేసిన
దేవుడెంతయు ప్రీతినొందును. ॥త॥

86. చిత్తమందున భయమువీడన్నా
నిర్భయంబుగ ఎల్లకార్యము జరుపవలెనన్నా
కృష్ణదేవుడు గీతయందున
బోధసల్పిన నిర్భయత్వము
నెల్ల వేళల నాశ్రయించి
జీవితంబున ధైర్యమొందుము. ॥త॥

87. భూతసేవయె దైవసేవన్నా
ప్రాణికోట్లకకకు, సేవచేయుటె దేవ పూజన్నా
ఒక్క ప్రాణికి హితము చేసిన
దేవదేవుని కొలిచినట్లే
భూతకోట్లకు చేయు సేవయె
విశ్వనాథుని సేవయగును. ॥త॥

88. రామ రామా యనుచు వేడన్నా
ప్రీతితోడను, రామ నామామృతము గ్రోలన్నా
రామ కృష్ణా యనుచు పాడుచు
దైవనామము స్మరణ చేసిన
పాపపంకిల మెల్ల తొలగును
వేగమే ప్రభునామశక్తిచే. ॥త॥

మానసబోధ

89. చెఱకులోపల రసము కలదన్నా
బాహ్యదృష్టికి, లోని రసము కానరాదన్నా
గానుగాడిన రసము అంతయు
కానుపించును స్పష్టరీతిని
సాధనంబుచె మనసునందున
గోచరించును ఆత్మ లెస్సగ. ॥త॥

90. జగమునంతట దేవు డొకడన్నా
విశ్వమంతట, ఏకతత్త్వము వెలయుచుండన్నా
ఆవులెన్నియు పాలు ఒకటే
కుండలెన్నియు మట్టి ఒకటే
దిండు లెన్నియొ దూది ఒక్కటే
ప్రాణు లెన్నియొ ఆత్మ ఒక్కటే. ॥త॥

91. మనసుతోటి పోరు సలుపన్నా
మలినచిత్తము ముక్తిపథమున అడ్డుయగునన్నా
సద్గుణాలను ఆయుధాలచె
దుర్గుణాలను రక్కసులను
తొలగద్రోచియు నిర్మలంబగు
చిత్తమందున గనుము దేవుని. ॥త॥

92. విషయమందున ఆశవలదన్నా
అనుభవించిన, ఆశ పెరుగును తరుగబోదన్నా
నిప్పలోను నేయివేసిన
మంట పెరుగును చల్లబడదు
నీరుపోసిన ఆరిపోవును
కోరకుండిన ఆశ లుడుగును. ॥త॥

93. దేహనౌకను కొంటివోరన్నా
విలువగలిగిన, వస్తువియ్యది తెలిసికోరన్నా
అధికపుణ్యము నిచ్చికొనిన
మనుజదేహపు నావతోను
సాగరంబును దాటివేయుము
శిథిలమైనది కాకపూర్వమె. ॥త॥

94. సుఖము వెలుపల లేదురోరన్నా
ఎల్లసుఖము, అంతరాత్మలో కలదురోరన్నా
సుఖము వస్తువునుండి వచ్చును
అని తలంచును మూఢజనుడు
లోని సుఖమే అటుల తోచును
బయటనుండి రాదు సుఖము. ॥త॥

95. దృశ్యమందున ప్రీతియుంచకురా
దృక్స్వరూపమునందు ప్రీతిని గలిగియుండుమురా
దృశ్యసక్తియె బంధమగును
దృశ్యముక్తియె మోక్షమగును
దృశ్యమంతయు తొలగద్రోచిన
ఆత్మయొకటే మిగిలియుండును. ॥త॥

96. రేపు రేవని పలుకవద్దన్నా
దైవసేవలో, వాయిదాలు వేయబోకన్నా
మరుక్షణము ఎటులనుండునో
రోగమేదియె ఆక్రమించునో
ఏ పరిస్థితి యెటుల మారునో
తలచు దేవుని వేగమిపుడే. ॥త॥

మానసబోధ

97. ఆయువేమియు స్థిరము కాదన్నా
త్వరగ దేవుని, పాదకమలము శరణువేడన్నా
చిల్లికుండలో నీరుపోసిన
గంట గంటకు తరుగునట్లు
దేహమందలి ఆయువంతయు
గడియ గడియకు తగ్గుచుండుము. ॥త॥

98. పామరత్వము పారద్రోలన్నా
విద్యలేమిచె, మానవత్వము వ్యర్థమగునన్నా
జ్ఞానమార్జనచేసి మనుజుడు
దేవుడై వెలుగొందవలయు
జ్ఞానమేమియు లేకయుండిన
ఘోరదుర్గతి కలిగితీరును. ॥త॥

99. జీవబ్రహ్మము లేకమేయన్నా
వారి ఐఖ్యము, తెలిసిబంధము తొలగద్రోయన్నా
పొట్టు ఉండిన వడ్లగింజ
పొట్టు ఊడిన బియ్యమేను
పాశబద్ధుడు జీవుడగును
పాశముక్తుడు పరమశివుడే. ॥త॥

100. శక్తియంతయు నీలో కలదన్నా
లోనశక్తిని, తెలిసి ధైర్యము కలిగియుండన్నా
నేను అల్పుడ నేను దుఃఖిని
అనుచు ఏల పరితపింతువు
సర్వశక్తులతోను గూడిన
ఆత్మనేనని శాంతినొందుము. ॥త॥

101. దేహమే యొక దేవళంబన్నా
దానియందున, ఆత్మదేవుడు వెలయుచుండన్నా
దుర్గుణాలను దూళినంతను
శ్రద్ధతోను ఊడ్చివేచి
సద్గుణాలను పూలచేతను
ఆత్మదేవుని పూజ సలుపుము. ॥త॥

102. దేహమేమియు తాను కాదన్నా
రక్తమాంసపు, బొమ్మయేయది తెలిసికోరన్నా
చేతనంబగు తాను యెటుల
నశ్వరంబగు దేహమగును
మాయయొక్క మోసమెఱిగి
జాగరూకత గలిగియుండుము. ॥త॥

103. ఘోరమైనది సాగరంబన్నా
సంసార మెంతయు, భీకరంబుగ తోచుచుండన్నా
కామ క్రోధ మకరములతో
భీషణంబగు సాగరంబును
దైవసేవను పడవచేతను
లీలగా భువి దాటివేయుము. ॥త॥

104. దృశ్యమంతయు భీతియుతమన్నా
భీతిలేనిది, ఆత్మయేనని విశ్వసించన్నా
రోగభయము, ఈతిభయము
శత్రుభయము, మృత్యుభయము
భయములన్నియు తొలగిపోవును
ఆత్మదేవుని బడసినపుడు. ॥త॥

105. మనసు బుద్ధియు నీవు కాదన్నా
నీ స్వరూపము ఆత్మయేయని తెలిసికోరన్నా
ఆత్మయందున నిష్ఠ గలిగి
దృశ్యమందున రోతజెంది
జీవితాంతము కాకపూర్వమె
బ్రహ్మపదవిని బొందు రయమున. ॥త॥

106. పరమసౌఖ్యమె నీవురోరన్నా
దుఃఖమెన్నడు, లోకమేమియు నీకు లేదన్నా
మనసుచేతనె దుఃఖ మేర్పడు
మనసుదాటిన దుఃఖ మెచట
మనసులేని ఆత్మయందున
ఎల్లవేళల స్థితిని బడయుము. ॥త॥

107. యత్నమెన్నడు వీడబోకన్నా
మోక్షపదవియు, యత్నఫలమని యెఱుగుమోరన్నా
సమయమేమియు పాడుచేయక
సాధనంబును చేయుచుండుము
విడువకుండను ఆచరించిన
సత్వరంబుగ ముక్తికలుగును. ॥త॥

108. తత్త్వసారము ఇంతియేయన్నా
విద్యాప్రకాశుని మాటగైకొని ఆచరించన్నా
ఋషులు తెలిపిన శాస్త్రవాక్యము
పరమసత్యము మదిని నమ్ముము
ఉచ్చరించిన గలుగు పుణ్యము
ఆచరించిన గలుగు మోక్షము. ॥త॥

మానసబోధ